సాక్షి
రాజన్న సిరిసిల్ల

శనివారం । 21 । డిసెంబర్ । 2024



అంజన్న ఆదాయం రూ.4.17లక్షలు

వేములవాడఅర్బన్: అగ్రహారం హనుమాన్ ఆలయంలోని హుండీని శుక్రవారం లెక్కించారు. హుండీ ఆదాయం రూ.4,17,938 వచ్చినట్లు ఈవో మారుతి తెలిపారు.



ముస్తాబాద్‌కు మా'నీరు'

ముస్తాబాద్(సిరిసిల్ల): ఎగువమానేరు కుడికాల్వ ద్వారా మా'నీరు' శుక్రవారం ముస్తాబాద్‌కు చేరింది. పోతుగల్, తెర్లుమద్ది చివరి ఆయకట్టుకు నీరందించాలని రైతులు కోరుతున్నారు.

గరిష్టం/కనిష్టం
32.0/21.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. పొగమంచు కమ్మేసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేతన్న బీమా విడుదలకు కృషి



సిరిసిల్లకల్చరల్: అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డ నేత కార్మికుడు దూస గణేశ్‌కు రావాల్సిన బీమా డబ్బులు విడుదలయ్యేందుకు కృషి చేయనున్నట్లు చేనేత, జౌళి శాఖ అదనపు సంచాలకుడు సాగర్ తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో గణేశ్ కుటుంబ సభ్యులను కలిసి మాట్లాడారు. మరమగ్గాల కార్మికుడిగా పట్టణంలోని శ్రీరామ్ విష్ణు దగ్గర పనిచేసే గణేశ్ తన అవసరాల నిమిత్తం రూ.5లక్షలు అప్పు చేశాడని, అప్పులు ఇచ్చిన వారు వేధించడంతో శుక్రవారం ఉదయం తన ఇంటిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. స్థానిక నేత గుండ్లపెల్లి పూర్ణచందర్, సామాజిక కార్యకర్త వేముల మార్కండేయులు ఉన్నారు.

'అసైన్డ్ భూములు మింగిన వారికి శిక్ష తప్పదు'



ముస్తాబాద్(సిరిసిల్ల): అసైన్డ్ భూములను మింగిన వారికి శిక్ష తప్పదని కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల కో–కన్వీనర్ కనమేని చక్రధర్‌రెడ్డి హెచ్చరించారు. ముస్తాబాద్‌లోని పార్టీ ఆఫీస్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ధరణిని అడ్డం పెట్టుకొని ఎస్సీలకు చెందిన వేలాది ఎకరాలను కొందరు బీఆర్‌ఎస్ నాయకులు పట్టాలు చేయించుకున్నారని ఆరోపించారు. అక్రమార్గంలో అసైన్డ్ భూములు పొందిన వారికి చట్టపరంగా శిక్షలు తప్పవని హెచ్చరించారు. కాంగ్రెస్ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి ప్రజలకు సేవ చేస్తుంటే ఓర్వలేక బీఆర్‌ఎస్ నాయకులు విమర్శిస్తున్నారన్నారు. ప్రజల కోసం పనిచేస్తున్న కలెక్టర్‌ను అహంకార పూరితంగా దూషించిన కేటీఆర్‌కు ప్రజలే బుద్ధి చెప్తారన్నారు. యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా గెలిచిన రంజాన్ నరేశ్‌ను సన్మానించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ అంజన్‌రావు, తలారి నర్సింలు, ఆలయ కమిటీ చైర్మన్ ఎల్సాని దేవయ్య, ప్యాక్స్ డైరెక్టర్ దేవేందర్, కనమేని శ్రీనివాస్‌రెడ్డి, వేణు, శాదుల్, మధు, శ్రీకాంత్ పాల్గొన్నారు.


సిరిసిల్ల వాసికి 'అతి విశిష్ట' పురస్కారం



కామారపు వినోద్

సిరిసిల్లటౌన్: రైల్వేశాఖ అందించే ప్రతిష్టాత్మక పురస్కారం సిరిసిల్ల వాసికి దక్కింది. స్థానిక గాంధీనగర్‌కు చెందిన కామారపు వినోద్ రైల్వేశాఖలో సీనియర్ సెక్షన్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. హసన్‌పర్తి నుంచి వరంగల్ వరకు భూగర్భ సొరంగమార్గంలో విద్యుత్ పనులు త్వరగా పూర్తిచేశారు. 2023–24లో ఉప్పల్ నుంచి హసన్‌పర్తి, వరంగల్ నుంచి చింతలపల్లి వరకు 61.546 కి.మీ విద్యుదీకరణ పూర్తి చేశారు. దీంతో రైల్వేశాఖ అతి విశిష్ట రైల్ సేవ పురస్కారాన్ని ఈనెల 21 ఢిల్లీలో కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ చేతుల మీదుగా అందజేయనుంది.

వినూత్న నిరసన



సిరిసిల్లటౌన్: తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ సమగ్రశిక్ష ఉద్యోగులు చేపట్టిన దీక్ష శుక్రవారం 11వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వినూత్నంగా సోది చెబుతూ నిరసన తెలిపారు. 'సోది అమ్మగా' రుద్రంగి సీఆర్పీ శ్రీవాణి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలంటూ చెప్పడం ఆకట్టుకుంది.

జీపీ అధికారులపై విచారణకు ఆదేశం

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ స్పెషలాఫీసర్, పంచాయతీ కార్యదర్శి ఈనెల 23న జీపీలో జరిగే విచారణకు హాజరుకావాలని జెడ్పీ సీఈవో శుక్రవారం ఆదేశాలు జారీచేశారు. గ్రామపంచాయతీ సఫాయి సిబ్బందికి డ్రెస్ కొనుగోలు కోసం గత ఆగస్టులో రూ.1.93లక్షలు పంచాయతీ జీరో అకౌంట్ నుంచి డ్రా చేశారని, డ్రెస్సులు కొని సిబ్బందికి ఇవ్వలేదని అంబేడ్కర్ సేవా రత్న, జాతీయ అవార్డు గ్రహీత మంగళి చంద్రమౌళి రెండు రోజుల క్రితం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో విచారణ చేపట్టాలని జెడ్పీ సీఈవోను కలెక్టర్ ఆదేశించారు. దీంతో ఈనెల 23న విచారణకు హాజరుకావాలని సీఈవో ఆదేశాలు జారీచేశారు.


అతివేగం.. అజాగ్రత్త



ఈ క్షతగాత్రుడు రుద్రంగి మండల కేంద్రానికి చెందిన కంటే రాములు. తన ఎక్సెల్ వాహనంపై బుధవారం స్థానిక బస్టాండ్ వైపు వెళ్తుండగా ఇంటర్ సెకండియర్ చదువుతున్న మైనర్ బాలుడు అతివేగంగా బైక్‌పై వచ్చి ఢీకొట్టాడు. రాములు తలకు తీవ్ర గాయాలు కాగా.. 108లో వేములవాడకు తరలిస్తుండగా చనిపోయాడు. ఇలా జిల్లాలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో మైనర్ల ర్యాష్ డ్రైవింగ్‌తో అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇంత జరుగుతున్నా తల్లిదండ్రుల పర్యవేక్షణ, అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడమే ప్రధాన కారణమని భావిస్తున్నారు.



ఇదీ.. ముస్తాబాద్ మండలం పోతుగల్ శివారులో ఇటీవల జరిగిన ప్రమాదం. ఈ సంఘటనలో ఇటుక ట్రాక్టర్‌ను నడుపుతున్న డ్రైవర్ అతివేగంగా వచ్చి ద్విచక్రవాహనంపై వెళ్తున్న గీతకార్మికుడు చేపూరి కైలాసంను ఢీకొట్టగా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. కుటుంబ పెద్ద చనిపోవడంతో అతని ముగ్గురు కొడుకులు, భార్య దిక్కులేని వారయ్యారు.



ఇదీ.. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్‌కు ఎదురుగా బుధవారం మధ్యాహ్నం అతివేగంగా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్. బ్యాంక్‌కు ఎదురుగా దుర్గమ్మ గుడి వద్ద నిలిపి ఉంచిన వాహనాన్ని అతివేగంగా ఢీకొట్టింది. అదే సమయంలో అక్కడ బస్సు కోసం ఎదురుచూస్తున్న పలువురు ప్రయాణికులు త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డారు. ఆ వాహనాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్ డ్రైవర్ కనీసం అక్కడ ఆగకుండా అదే వేగంతో పరారయ్యాడు. ఈ సంఘటనకు ప్రత్యక్ష సాక్షులైన ప్రయాణికులు ట్రాక్టర్ డ్రైవర్ మైనర్ అని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నాడని, సమయం కూడా మధ్యాహ్నం 2.15 గంటలు దాటిందని తెలిపారు.



రెవెన్యూ అధికారులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

- ప్రాణాలు తీస్తున్న మైనర్ డ్రైవింగ్
- జిల్లాలో నెల రోజుల్లో 15 సంఘటనలు
- ఇద్దరు మృతి.. పలువురికి గాయాలు
- పట్టించుకోని అధికారులు
- తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తున్నా మారని తీరు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అతివేగం.. అజాగ్రత్త.. త్వరగా వెళ్లాలన్న ఆతృత ప్రాణాలమీదికి తెస్తోంది. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని పోలీసులు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. జిల్లాలో నెల రోజుల్లో 16 ప్రమాదాలు జరుగగా.. ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. వీరిద్దరూ మైనర్లే కావడం విషాదం. అనేక మంది క్షతగాత్రులయ్యారు. ఇప్పటికీ చాలా మంది కోలుకోవడం లేదు. ఇందులో 10 ప్రమాదాలు మైనర్లు వాహనాలు నడపడంతోనే జరిగాయి. ధనార్జనే ధ్యేయంగా ఇసుక మాఫియా ట్రిప్పుల సంఖ్యను పెంచుకోవడానికి అతివేగంగా వాహనాలు నడపడంతోనే ప్రజల ప్రాణాల మీదికొస్తోంది.

మైనర్లే డ్రైవర్లు

ఇసుక ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు నడిపేవారిలో అత్యధికులు మైనర్లే కావడం ప్రమాదాలకు కారణంగా తెలుస్తోంది. డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకున్నా, రోడ్డు భద్రత నియమాలు తెలియకుండా వాహనాలతో రోడ్లపైకి వస్తున్నారు. అసలే యువకులు.. ఆపై చెవుల్లో ఇయర్‌ఫోన్స్ పెట్టుకొని వాహనాలు నడుపుతూ వెనక వచ్చే వాహనాలను గమనించక ప్రమాదాలకు కారకులవుతున్నారు. పోలీసులు సైతం మైనర్‌లను పట్టుకొని ఇటీవల తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేసిన సంఘటనలు ఉన్నాయి. అయినా వారి తల్లిదండ్రులు, ఇసుక ట్రాక్టర్ల యజమానుల్లో మార్పు రావడం లేదు. మైనర్లకే మళ్లీ.. మళ్లీ వాహనాలు ఇస్తున్నారు.

నిబంధనలు బేఖాతర్

ద్విచక్రవాహనదారులు, కార్లు నడిపే వారు కనీస నిబంధనలు పాటించడం లేదు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్లు ధరించకుండా వెళ్తుండడంతో ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల జరిగిన పలు సంఘటనల్లో అత్యధిక మంది హెల్మెట్లు లేకపోవడంతోనే ప్రాణాలు కోల్పోయారు. హెల్మెట్లు ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపొద్దని పోలీసులు అవగాహన కల్పిస్తున్నా ప్రజల్లో మార్పు రావడం లేదు. ప్రాణాలు పోతే వారి కుటుంబాలు రోడ్డున పడి చిన్నాభిన్నమవుతున్నాయి. పెద్ద దిక్కును కోల్పోయి కుటుంబ సభ్యులు అనాథలవుతున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఒక్క ఎల్లారెడ్డిపేటలోనే నాలుగు ప్రమాదాలు..

ఎల్లారెడ్డిపేట మండలంలో ఆగస్టు నెల నుంచి నాలుగు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇందులో తొమ్మిది మంది తీవ్రంగా గాయపడగా, నలుగురు ప్రాణాలు కోల్పోయారు. గుజరాత్ రాష్ట్రానికి చెందిన దేశాయిబీడీ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ కులదీప్‌ను ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే చనిపోయాడు. రాచర్లబొప్పాపూర్ శివారులో కారును ఓవర్‌టేక్ చేయబోయి భూక్య సతీశ్ అనే మైనర్ మరణించాడు. మరో ప్రమాదంలో రాచర్లతిమ్మాపూర్ బస్టాండ్ వద్ద కారు ఢీకొని మంద నారాయణ మృతిచెందాడు. తాజాగా రాచర్లగొల్లపల్లి శివారులో డివైడర్‌ను ఢీకొట్టి ఎల్లారెడ్డిపేటకు చెందిన చందుపట్ల రాజిరెడ్డి అక్కడికక్కడే మరణించాడు. ఇలా మైనర్ల డ్రైవింగ్‌తో వారే ప్రాణాలు కోల్పోవడంతోపాటు ఇతరుల ప్రాణాలు తీస్తున్నారు.

అతివేగంతోనే ప్రమాదాలు



అతివేగంతోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మైనర్లకు ద్విచక్ర వాహనాలు, ఇసుక ట్రాక్టర్లు ఇవ్వవద్దని తల్లిదండ్రులు, ట్రాక్టర్ల యజమానులకు అవగాహన కల్పిస్తున్నాం. అయినా వారిలో మార్పు రావడం లేదు. నిత్యం వాహన తనిఖీలు చేపడుతున్నాం. వాహనాలు నడిపే మైనర్లపై ప్రతీ రోజు స్పెషల్ డ్రైవ్ చేపడతాం. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా సహకరించాలి.


– శ్రీనివాస్‌గౌడ్, ఎల్లారెడ్డిపేట, సీఐ

నిర్వహణ గాలికి !

- జలవనరులపై పర్యవేక్షణ కరువు
- 22 ఏళ్లుగా నీటిసంఘాలు లేవు
- జిల్లాలో 550 చెరువులు
- ఎగువ, మధ్యమానేరు జలాశయాలు

సాగు వివరాలు

- సిరిసిల్ల నియోజకవర్గం : 1,33,551 ఎకరాలు
- వేములవాడ నియోజకవర్గం : 1,55,866 ఎకరాలు
- మొత్తం : 2,89,417 ఎకరాలు
- చెరువుల కింద సాగు : 58,762 ఎకరాలు
- ఎస్సారెస్పీ : 6,481 ఎకరాలు
- 9వ ప్యాకేజీ సాగు : 64,200 ఎకరాలు
- 11వ ప్యాకేజీ సాగు : 22,511 ఎకరాలు
- ఎగువమానేరు ప్రాజెక్ట్ : 13,085 ఎకరాలు



జలకళతో కళకళలాడుతున్న ఇది ముస్తాబాద్ మండల కేంద్రంలోని పెద్దచెరువు. 2016లో భారీ వర్షాలకు గండిపడింది. అప్పటి మంత్రి కేటీఆర్ రూ.6కోట్లతో చెరువును బాగుచేయించగా, కాళేశ్వరం నీటితో, ప్రస్తుతం కురుస్తున్న వానలతో ఆరేళ్లుగా జలకళను సంతరించుకుంది. పెద్ద చెరువు కింద 450 ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువు ఎడమ షట్టర్ తూము లీకేజీ అవుతోంది. నీరంతా వృథాగా పోతోంది. చెరువు కింద కాలువలు అన్యాక్రాంతమయ్యాయి. చెరువులో పూర్తి సామర్థ్యంతో నీరు ఉన్నా ఒక్క ఎకరాకు కూడా సాగునీరందించే స్థితిలో లేదు. లీకైన నీరు కింద ఉన్న కుంటలో చేరుతోంది. అందులో ఊరి మురుగునీరు కలిసి కలుషితమవుతోంది. నీటి సంఘాల బాధ్యులుంటే ఆయకట్టు తైబంధీ తీర్మానించి కాల్వలను బాగుచేసేవారు.

ముస్తాబాద్(సిరిసిల్ల): జలవనరుల నిర్వహణను ప్రభుత్వం గాలికొదిలేసింది. దాదాపు రెండు దశాబ్దాలుగా నీటిసంఘాలకు ఎన్నికలు లేవు. ఫలితంగా పాలకవర్గాలు లేక చెరువులు, ఆయకట్టు కాల్వల నిర్వహణ, మరమ్మతుపై ఎవరికీ పట్టింపు లేదు.


రెండు దశాబ్దాల క్రితం..

2002, 2004లో నీటి సంఘాలకు ఎన్నికలు జరుగగా, ఇప్పటి వరకు నీటి సంఘాల గురించి ఏ ప్రభుత్వం పట్టించుకోలేదు. జిల్లాలో 550 చెరువులు, కుంటలు, నర్మాల వద్ద ఎగువమానేరు, బోయినపల్లి మండలంలో మధ్యమానేరు, ఇల్లంతకుంట మండలం అనంతారం వద్ద అన్నపూర్ణ ప్రాజెక్టులు ఉన్నాయి. చిన్ననీటి వనరులు సింగసముద్రం, మూలవాగుపై నిమ్మపల్లి ప్రాజెక్టులు ఉన్నాయి. 500లోపు ఎకరాలకు సాగునీరందించే చెరువులు 15 వరకు ఉన్నాయి. ఎగువ మానేరు ప్రాజెక్టులో 8 మంది నీటి సంఘాల చైర్మన్లను గతంలో ఎన్నుకున్నారు. జిల్లాలో 1.50లక్షల మంది రైతులు ఉన్నారు. పట్టాదారు పాస్‌బుక్కులు ఉన్న వారికి గతంలో ఓటుహక్కు కల్పించారు.

నీటి సంఘాల విధులు ఇవీ..

- చెరువులు, కుంటల నిర్వహణ బాధ్యతలు.
- సంఘాల చైర్మన్లు, నీటిపారుదలశాఖ అధికారుల సమన్వయంతో సాగునీటిని అందించే పనులను రెగ్యులర్‌గా చేపడతారు.
- చెరువులు, కాలువల మరమ్మతు పనులు పర్యవేక్షిస్తారు.
- నీటి లీకేజీలు, కాల్వలకు పడ్డ బుంగలు పూడ్చడం, నీటిచౌర్యం నివారిస్తారు.
- నీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చూస్తారు.

సంఘాలను పట్టించుకోలేదు



ముస్తాబాద్ మండలానికి 10వేల ఎకరాలకు నీరందించే ఎగువమానేరు కింద ఉన్న లోతుచెరువు నిర్వహణ గాలికొదిలేశారు. ఫలితంగా నీరందడం లేదు.

– కలకొండ కిషన్‌రావు, నీటి సంఘాల మాజీ చైర్మన్

సక్రమంగా నీరందేలా చూశాం



ఇరవై ఏళ్ల క్రితం చైర్మన్‌గా పనిచేసిన సమయంలో ఎప్పటికప్పుడు రైతులతో మాట్లాడి నీళ్లు అందేలా చూసేవాళ్లం. ఇప్పుడు ఎవరూ పట్టించుకోవడం లేదు.

– కొండం రాజిరెడ్డి, మాజీ చైర్మన్

వారధిలా పనిచేస్తాయి



నీటి సంఘాల బాధ్యులు అధికారులు, రైతులకు మధ్య వారధిలా పనిచేస్తారు. సమస్యలుంటే రైతుల తరఫున చైర్మన్లు మాట్లాడుతారు. నీటిసంఘాల ఎన్నికలపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు.

– రవికుమార్, డీఈఈ



గెలుపే లక్ష్యం..

సిరిసిల్లటౌన్: సీఎం కప్–2024 జిల్లాస్థాయి పోటీలు శుక్రవారం సిరిసిల్లలోని మినీస్టేడియంలో నిర్వహించారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, బ్యాడ్మింటన్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, యోగా, చెస్, కిక్‌బాక్సింగ్, ఉషు, జూడో, టేబుల్‌టెన్నిస్, క్యారంబోర్డ్, కరాటే, పవర్‌లిఫ్టింగ్ అంశాల్లో పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా అగ్రికల్చర్ ఆఫీసర్ అఫ్జల్ బేగం, ఆర్టికల్చర్ ఆఫీసర్ కె.ఆర్.లత, ఫిషరీస్ ఆఫీసర్ సౌజన్య హాజరై విజేతలకు బహుమతులు అందించారు. జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి రామదాసు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.



రన్నింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు



కిక్‌బాక్సింగ్‌లో తలపడుతున్న క్రీడాకారులు

కుమ్మరికుంట కబ్జా



కొలనూర్ చెరువులో పాతిన హద్దురాళ్లు

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని కొలనూర్‌లో చెరువు కబ్జాకు గురవుతోంది. కోనరావుపేట మండలం కొలనూర్‌లోని బీసీకాలనీ శివారులో సర్వే నంబర్ 416, 417లో కుమ్మరికుంట ఉంది. పురాతన కాలం నుంచి యాదవుల పేరిట ఉన్న ఈ కుంటలో 2002లో రజకసంఘానికి దోబీఘాట్లు నిర్మించి ఇచ్చారు. కొన్నేళ్లుగా వారు దోబీఘాట్లను వినియోగించకపోవడంతో అవి శిథిలమయ్యాయి. కొన్నేళ్లుగా అలాగే ఉన్న ఈ చెరువులో కొద్ది రోజుల క్రితం గ్రామానికి చెందిన వ్యక్తి చెరువులో కొంతభాగాన్ని చదును చేశారు. ఈ చెరువు తమదేనంటూ రజక సంఘం ఆధ్వర్యంలో హద్దులు పాతారు. కాగా ఈ కుమ్మరికుంట సుమారు 4 ఎకరాల్లో ఉండగా ప్రస్తుతం 20 గుంటలకే పరిమితమైంది. ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా డీటీ, ఆర్ఐ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి హద్దురాళ్లను తొలగించాలని ఆదేశించారు. ఇప్పటి వరకు హద్దురాళ్లు అలాగే ఉన్నాయి. తమ గ్రామానికి చెందిన కుమ్మరికుంట చెరువును కాపాడాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

చందుర్తి-మేడిపల్లి రోడ్డుకు మోక్షం

- ఎట్టకేలకు అటవీశాఖ అనుమతి



చందుర్తి-మోత్కురావుపేట గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో నిలిచిన రోడ్డు

చందుర్తి(వేములవాడ): రెండు జిల్లాల సరిహద్దు అటవీప్రాంతంలో తారురోడ్డు నిర్మాణానికి ఎట్టకేలకు అటవీశాఖ నుంచి అనుమతులు లభించాయి. రాజన్నసిరిసిల్ల, జగిత్యాల జిల్లాల సరిహద్దు చందుర్తి–మోత్కురావుపేట గ్రామాల మధ్య గల అటవీ ప్రాంతంలో 3.450 కిలోమీటర్ల దూరం రోడ్డు వేసేందుకు అటవీశాఖ అనుమతి లభించక దశాబ్దకాలంగా వేచిచూస్తున్నారు. రూ.19.75కోట్లు మంజూరుకాగా 10 కిలోమీటర్లకుపైగా తారు రోడ్డు నిర్మాణమైంది. మిగిలిన 3.450 కిలోమీటర్ల దూరం అనుమతికి వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేసిన కృషితో అనుమతులు లభించాయి. ఈ రోడ్డు పూర్తయితే రెండు జిల్లాల ప్రజలకు దూరభారం తగ్గనుంది.

కాంగ్రెస్ దిగజారుడు రాజకీయం

- తప్పులను ప్రశ్నిస్తే అరెస్టులు
- నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు



మాట్లాడుతున్న కొండూరి రవీందర్‌రావు

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు దిగజారుడు రాజకీయాలు చేస్తోందని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు ఆరోపించారు. సిరిసిల్లలోని బీఆర్‌ఎస్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. కేటీఆర్ ఒక విద్యావేత్తగా హైదరాబాద్‌లో ప్రజలకు ఈ రేసింగ్ పరిచయం చేశారన్నారు. కేటీఆర్ మీద పెట్టిన కేసు కుట్రపూరితమైందని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో బీఆర్‌ఎస్‌ది రాచరిక పాలన అన్న మీరూ.. చేస్తుందని నియంత పోకడ కాదా అని ప్రశ్నించారు. ప్రశ్నించే బీఆర్‌ఎస్ గొంతుకలను జైలులో వేస్తున్నారన్నారు. ప్రజలకు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

రాష్ట్రానికి దొరికిన దరిద్ర సీఎం

రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి దొరికిన దరిద్ర ముఖ్యమంత్రిగా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అభివర్ణించారు. డబ్బుల సంచులతో దొరికిన వ్యక్తి ఇతరులపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తెల్లారి లేస్తే బీఆర్‌ఎస్‌పై, కేసీఆర్, కేటీఆర్‌లపై దుర్భాషలాడడం తప్ప చేసేదేమి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీఎస్‌పీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, న్యాలకొండ రాఘవరెడ్డి, దార్ల సందీప్, అన్నారం శ్రీనివాస్, బొల్లి రామ్మోహన్, దిడ్డి రాజు పాల్గొన్నారు.

సన్నరకం వరి విత్తనాలు పంపిణీ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల దత్తత గ్రామం రాళ్లపేటలో రైతులకు శుక్రవారం విత్తనశుద్ధిపై ప్రొఫెసర్లు అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ డాక్టర్ జె.రాజేందర్ మాట్లాడుతూ.. కిలో విత్తనానికి మూడు గ్రాముల కార్బండెజిమ్ 50 శాతం కలిపి 24 గంటల తరువాత నారుమడిలో చల్లుకోవాలన్నారు. దంప నారుమళ్లకు లీటరు నీటికి ఒక గ్రాము కార్బండెజిమ్ 50 శాతం కలిపి, ఆ ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నానబెట్టి, 24 గంటలు మండెకట్టి మొలకెత్తిన విత్తనాలను దంప నారుమడిలో చల్లుకోవాలని సూచించారు. రైతులకు కూనారం సన్నరకం వరి విత్తనాలను పంపిణీ చేశారు. కళాశాల ప్రొఫెసర్లు, దత్తత గ్రామ కమిటీ సభ్యులు డాక్టర్ సతీశ్, డాక్టర్ సంపత్, రాళ్లపేట మాజీ సర్పంచ్ పరశురాములు, 20 మంది రైతులు పాల్గొన్నారు.



మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ ఫోకస్

మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ ఫోకస్ పెట్టామని ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇటీవల వాహనాలు నడుపుతూ దొరికిన మైనర్లకు తల్లిదండ్రుల సమక్షంలో సిరిసిల్లటౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ కౌన్సిలింగ్‌కు దాదాపు 350 మంది చిన్నారులు తమ తల్లిదండ్రులతో హాజరయ్యారు.

– వివరాలు 8లో▸

క్లుప్తంగా

నేరెల్ల గుట్టల్లో మృతదేహం?

ధర్మపురి: మండలంలోని నేరెల్ల గుట్టల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అడవిలో పనులకు వెళ్లిన కొందరు సదరు మృతదేహాన్ని చూసినట్లు తెలిసింది. దీనిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ విషయమై ఎస్సై ఉదయ్‌కుమార్‌ను వివరణ కోరగా అడవిలో మృతదేహం ఉన్నట్లు వదంతులు వస్తున్న మాట నిజమేనని, కానీ ఎక్కడుందో తెలియడం లేదని పేర్కొన్నారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, గాలింపు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య


రమేశ్ మృతదేహం

హుజూరాబాద్: మండలంలోని రాంపూర్‌కు చెందిన సుంకరి రమేశ్(46) ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. రమేశ్‌కు భార్య, ఇద్దరు పిల్ల లున్నారు. దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండటంతో రెండేళ్ల క్రితం పిల్లలను తీసుకొని, భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటినుంచి రమేశ్ ఏ పనీ చేయకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో అతనికి కేన్సర్ ఉన్నట్లు తెలిసింది. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టి, భార్యను ఇంటికి రావాలని కోరినా ఆమె రాలేదు. దీంతో రమేశ్ మనస్తాపానికి గురై, శుక్రవారం ఇంట్లోనే ఉరేసుకున్నాడు. మృతుడి తల్లి కొమురమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

కుక్కల దాడిలో గొర్రెపిల్లలు మృత్యువాత


చనిపోయిన గొర్రెపిల్లలు

ధర్మారం(ధర్మపురి): నర్సింగపూర్ గ్రామానికి చెందిన బద్ద సుధాకర్‌రెడ్డి గొర్రెల మందపై శుక్రవారం ఉదయం కుక్కలు దాడిచేశాయి. ఈ ఘటనలో 12 గొర్రెపిల్లలు చనిపోయాయి. తన ఇంటి వెనుకాల షెడ్‌లో గొర్రెలను ఉంచగా, వీధికుక్కలు ఒక్కసారిగా దాడిచేసి చంపినట్లు బాధితుడు సుధాకర్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన తర్వత గొర్రె పిల్లలకు పాలు పెట్టేందుకు వెళ్లగా గొర్రెపిల్లలు కనిపించలేదని, సమీపంలో గాలించగా కళేబరాలు కనిపించాయని ఆవేదన వ్యక్తం చేశాడు. గొర్రె పిల్లల కోసం వేసిన ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసి గొర్రె పిల్లలను ఎత్తుకుపోయి చంపినట్లు అతడు వివరించాడు.

పీఏసీఎస్ సేవలు విస్తరించాలి


మాట్లాడుతున్న నాబార్డ్ సీజీఎం ఉదయభాస్కర్

సుల్తానాబాద్(పెద్దపల్లి): పీఏసీఎస్ సేవలు విస్తరించాలని నాబార్డ్ సీజీఎం ఉదయభాస్కర్ అన్నారు. శుక్రవారం సుల్తానాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. సహకార సంఘం సభ్యులకు 6 శాతం డివిడెంట్ ఇవ్వడం శుభపరిణామమని అన్నారు. వ్యాపారులకు, గృహ నిర్మాణదారులకు రుణాలు ఇవ్వడంతోపాటు లాకర్ సౌకర్యం ఏర్పాటు చేస్తే మరిన్ని లాభాలు వస్తాయని తెలిపారు. రైతులకు ఎక్కువ రుణాలు ఇచ్చే ప్రయత్నం చేయాలని సూచించారు. చైర్మన్, కేడీసీసీబీ డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పీఏసీఎస్ పరిధిలో 3,499 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. రూ.40 కోట్ల విలువైన రుణాలు ఇచ్చామని, రూ.19 కోట్ల డిపాజిట్లు ఉన్నాయన్నారు. అనంతరం నాబార్డ్ సీజీఎంను సన్మానించారు. కార్యక్రమంలో కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణరావు, డీడీఎంలు జయప్రకాశ్, దిలీప్, జీఎం రియాజుద్దీన్, రిసోర్స్‌పర్సన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతు చేయరు.. పూడిక తీయరు

- ఎస్సారెస్పీ కాల్వల నిర్వహణ అధ్వానం
- చివరి ఆయకట్టుకు నీరందక ఎండుతున్న పంటలు


ఇది డీ–89 ప్రధాన కాల్వ దుస్థితి. కరీంనగర్ మండలం ఎలబోతారం శివారులో కాల్వ సిమెంట్ లైనింగ్ కూలిపోగా, అడ్డుగా పడిన బండరాళ్లతో కిందకు నీళ్లు వెళ్లలేని స్థితి. కరీంనగర్ జిల్లాలోని చాలావరకు కాల్వలది ఇదే పరిస్థితి.


పెద్దపాపయ్యపల్లి మీదుగా వెళ్లే ఉప కాలువలో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు

కరీంనగర్‌రూరల్/హుజూరాబాద్: ఎస్సారెస్పీ కాల్వలు అధ్వానంగా మారాయి. ఆయకట్టు కాల్వలు శిథిలావస్థకు చేరాయి. డ్రాపులు కూలిపోయి పొలాలకు నీళ్లందడం లేదు. ప్రధాన కాల్వలకు మరమ్మతు చేయకపోవడం, పూడిక తీయకపోవడంతో ఏటా ఆయకట్టు చివరి భూములకు నీరందక పంటలు ఎండిపోతున్నాయి. ప్రస్తుతం యాసంగి సీజన్ పంటల సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల 25 నుంచి ఎస్సారెస్పీ నీటిని విడుదల చేస్తారనే ప్రభుత్వ ప్రకటనతో పలువురు రైతులు వరిపంటను సాగు చేసేందుకు ముందుకొస్తున్నారు.

పేరుకుపోయిన పూడిక

కరీంనగర్‌రూరల్ డివిజన్ పరిధిలో డీ–89 నుంచి డీ–94 ప్రధాన కాల్వల ద్వారా 27వేల ఎకరాలు సాగవుతోంది. డీ–89 ప్రధాన కాల్వ శిథిలావస్థకు చేరింది. డ్రాపులు కూలిపోగా సిమెంట్ లైనింగ్ ధ్వంసమైంది. కాల్వల్లో బండరాళ్లు అడ్డుగా పడడంతో ఆయకట్టు కింది గ్రామాలు ఇరుకుల్ల, మొగ్దుంపూర్, సాంబయ్యపల్లి, గొల్లపల్లి గ్రామాల్లోని ఆయకట్టు భూములకు నీళ్లందడం లేదు. ప్రధాన కాల్వతోపాటు ఉపకాలువల్లో సైతం పిచ్చిమొక్కలతో పూడిక పేరుకుపోయింది. డీ–94 ప్రధాన కాల్వ ద్వారా గోపాల్‌పూర్, దుర్శేడ్, బొమ్మకల్, చేగుర్తి గ్రామాలకు సాగునీరు సరఫరా చేస్తారు. అయితే కార్పొరేషన్‌లో విలీనమైన రేకుర్తి, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్ పరిధిలోని కాలువలో పిచ్చిమొక్కలు పెరిగి పూడిక పేరుకుపోయింది. ఆయా గ్రామాల్లో ఉపాధిహామీలో పూడికతీసే అవకాశం లేకపోవడంతో ఇటీవల మున్సిపల్ నిధులు రూ.6 లక్షలతో పూడిక తొలగించే పని చేపట్టారు.


ఇరుకుల్ల శివారులో కాలువ గట్టుకు పడిన గండి


మొగ్దుంపూర్‌లో కూలిన డ్రాపు

250 ఎకరాలకు నీరందించే కాలువపై అలసత్వం..

ఎస్సారెస్పీ కెనాల్ కింద గల డీబీఎం–17 ఉప కాలువ పరిధిలో పెద్ద పాపయ్యపల్లి, హుజూరాబాద్, రాంపూర్, రంగాపూర్ గ్రామాల్లో సుమారు 250 ఎకరాలకు నీరందించే లక్ష్యంగా ఏర్పాటైంది. పెద్దపాపయ్యపల్లి నుంచి ప్రారంభమై హుజూరాబాద్ పోచమ్మగుండ్ల కింది వరకు వెళ్లి వాగులో కలుస్తుంది. ఉపకాల్వ కింద ఆయకట్టు రైతులు ఏడాదికి రెండు పంటలు పండించవచ్చు. ఆయకట్టు రైతులే లక్ష్యంగా ఉన్న ఈ కాలువపై అధికారుల పట్టింపు కరువవడంతో పూర్తిగా రూపురేఖలు కోల్పోయింది.

పూర్వ వైభవం తీసుకురావాలి



ఆయకట్టు రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని అధికారులు డీబీఎం–17 ఉపకాలువకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి. పేరుకుపోయిన పూడిక, పిచ్చిమొక్కలను తొలగించాలి. కాలువ సరిగ్గా లేకపోతే చివరి ఆయకట్టు వరకు నీరందే పరిస్థితి లేదు. అధికారులు చొరవ తీసుకొని మరమ్మతులు చేయించి కాలువకు పూర్వవైభవం తీసుకురావాలి.

– పసుల స్వామి, సామాజిక కార్యకర్త, హుజూరాబాద్

అత్యవసర పనులకే నిధులు మంజూరు

ఎస్సారెస్పీలో అత్యవసరమైన పనులకు మాత్రమే ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. ఇరుకుల్ల వద్ద రూ.4లక్షలతో కల్వర్టు పనులు నడుస్తున్నాయి. ఉపాధిహామీ ద్వారా కొన్ని కాలువల్లో పూడిక తొలగించాం.

– సంతోష్, డీఈ, ఎస్సారెస్పీ, కరీంనగర్‌రూరల్

కాలువ శిథిలం.. పారకం ప్రశ్నార్థకం


సుద్దాలలో ధ్వంసమైన డీ-86 మెయిన్ కెనాల్ తూము

పెద్దపల్లి జిల్లాలో యాసంగి సాగు ప్రారంభమైంది. ఇప్పటికే మొక్కజొన్న ఏపుగా పెరుగుతోంది. కొందరు రైతులు వరి నారుపోశారు. నాట్లు వేసేందుకు మరికొందరు పొలాలు సిద్ధం చేస్తున్నారు. ఈ పంటలకు సాగునీరు అందించాల్సిన ఎస్సారెస్పీ కాలువలు ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, చెట్లు, పూడికతో దర్శనమిస్తున్నాయి. చాలాచోట్ల ధ్వంసమై సాగునీటి పారకానికి అవరోధంగా మారాయి. సుల్తానాబాద్ పరిధిలోని దృశ్యాలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి


చెట్లు, ముళ్ల పొదలతో నిండిన కాలువ

భూకబ్జా కేసులో బీఆర్‌ఎస్ నాయకుల రిమాండ్

సిరిసిల్ల క్రైం: ప్రభుత్వ భూమిని అక్రమంగా పట్టా చేసుకున్న బీఆర్‌ఎస్ నాయకులను సిరిసిల్ల పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు అగ్గి రాములు, తంగళ్లపల్లి స్టేషన్ పరిధిలో జిందం దేవదాసుపై కేసు నమోదైంది. అధికారులను మచ్చిక చేసుకొని, అసైన్డ్ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు వారిపై అభియోగాలున్నాయి. భూమి అనుభవదారుగా మార్చిన అప్పటి అధికారులపై కేసు నమోదు చేశామని, వారు పరారీలో ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పింఛన్ ఇప్పిస్తానని నగలు కాజేశాడు..


రోదిస్తున్న చిన్న గంగు

కోరుట్ల: ఓ వృద్ధురాలికి పింఛన్ ఇప్పిస్తానని నమ్మించిన దుండగుడు ఆమె నగలు కాజేశాడు. బాధితురాలి వివరాల ప్రకారం.. కథలాపూర్ మండలం దుంపెటకు చెందిన దొప్పల చిన్న గంగు శుక్రవారం పని నిమిత్తం కోరుట్లకు వచ్చింది. స్థానిక నంది చౌరస్తా వద్ద ఉండగా ఆమె వద్దకు ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి, నీకు పింఛన్ ఇప్పిస్తామని చెప్పాడు. మెడలో నగలు తీస్తే ఫొటో తీసుకుంటానన్నాడు. అతని మాటలు నమ్మిన చిన్న గంగు మెడలోని తులం బంగారు గొలుసుతోపాటు పావు తులం చెవికమ్మలు తీసి, ఇచ్చింది. వాటిని తీసుకున్న దుండగుడు వెంటనే అక్కడినుంచి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

అనారోగ్యంతో కళాకారుడి మృతి


బాబు (ఫైల్)

వీర్నపల్లి(సిరిసిల్ల): అడవిపదరకు చెందిన మాట్ల బాబు (47) అనే కళాకారుడు అనారోగ్యంతో మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. బాబు తన కళాప్రదర్శనల ద్వారా ఎన్నో తెలంగాణ, బహుజన సాంస్కృతిక వేదికల మీద, ఎలక్షన్ క్యాంపెయిన్‌లలో ప్రదర్శనలు ఇచ్చాడు. ఓవైపు పేదరికం వెంటాడుతున్నా డప్పే తన ఆయుధంగా ప్రజల్లో చైతన్యానికి కృషి చేశాడు. ఆయన అనారోగ్యానికి గురై, పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నాడు. నయం కాకపోవడంతో గురువారం రాత్రి ఇంట్లోనే మృతిచెందాడు. మృతుడికి భార్య మంజుల, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్, స్థానికులు కోరారు.

మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ ఫోకస్

- రాజన్నసిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- బైక్‌లు నడుపుతూ పట్టుబడిన దాదాపు 350 మందికి కౌన్సెలింగ్

సిరిసిల్ల క్రైం: పిల్లలకు బైక్‌లు ఇచ్చి, షాప్‌కు వెళ్లమనడం, బంధువులను తీసుకురావాలని చెప్పడం, వెనకాల కూర్చొని, వారితో డ్రైవింగ్ చేయించడం ప్రమాదకరమని రాజన్నసిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లాలో మైనర్లు వాహనాలు నడుతూ ప్రమాదాలకు కారణమవుతున్నందున నాలుగు రోజులుగా మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ ఫోకస్ పెట్టినట్లు తెలిపారు. దీంతో ఊహించని స్థాయిలో దాదాపు 350 మంది మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలకు పెద్దలు కారణమని పలువురిని కౌన్సిలింగ్ చేసిన ప్పుడు తెలిసిందన్నారు. వారికి సిరిసిల్ల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించామని తెలిపారు. పిల్లలు డ్రైవింగ్ చేసి, ప్రమాదాలకు కారణమైతే కేసులపాలవుతారన్నారు. వారికి వాహనాలు ఇవ్వడం మానుకోవాలని సూచించారు. ప్రస్తుతం పట్టుబడినవారి వివరాలను వెంటనే ఆన్‌లైన్ చేయాలని, మళ్లీ బైక్‌లు నడుపుతూ పట్టుబడితే కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. ఒకసారి ఎఫ్‌ఐఆర్ నమోదైతే ఉపాధి కోసం ఇతర దేశాలకు వెళ్లాలంటే పోలీసు క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇవ్వడానికి ఉండదన్నారు. అందుకే నిర్ణీత వయస్సు వచ్చే వరకు వాహనాలు నడపొద్దని సూచించారు.


మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్


హాజరైన మైనర్లు, తల్లిదండ్రులు

ఇకనుంచి ఇవ్వను



నేనే మా అబ్బాయిని బైక్ తీసుకెళ్లమని చెప్పాను. ప్రమాదాలు జరుగుతున్న తీరును పోలీసు సార్లు చెప్పిన తర్వాత ఇక బైక్ ఇవ్వొద్దని నిర్ణయించుకున్నాను. ఇప్పటినుంచి ఏదైనా పని ఉంటే నేనే వెళ్తాను.

– లింగపల్లి రాజేశం, సుందరయ్యనగర్, సిరిసిల్ల

సైకిల్‌పై వెళ్లమంటాం



డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా బండి నడపడం నేరమని ఇక్కడికి వచ్చినంక తెలిసింది. పిల్లలు అల్లరి చేస్తే వాహనం ఇచ్చాం. కానీ, ఇకనుంచి ఇవ్వము. పని ఉంటే సైకిల్, లేకుంటే నడిచి వెళ్లమని చెబుతాం.

– బిపాషా, సిరిసిల్ల

ఇంకోసారి బైక్ ఎక్కనివ్వను



మా ఊరిలో ఓ పెద్ద మనిషికి బైక్ అవసరం అంటే వాళ్ల ఇంటి నుంచి మావాడు తీసుకెళ్లి, పోలీసులు పట్టుబడ్డాడు. పిల్లలు వాహనాలు నడపడం ప్రమాదకరమని ఎస్పీ సారు చెప్పారు. ఇంకోసారి బైక్ ఎక్కనివ్వను.

– యానా రాజేశం, సిరిసిల్ల

ప్రజలు సహకరించాలి

వాహనాలు నడిపిన పిల్లలను పట్టుకుంటే తల్లిదండ్రులు విడిచిపెట్టాలని పైరవీలు చేయిస్తున్నారు. సంబంధిత పోలీసు అధికారులపై కోపగిస్తున్నారు. భవిష్యత్తు తరం ప్రమాదానికి గురికావొద్దనే మేము నాలుగు రోజులు తనిఖీలు చేశాం. మార్పు వస్తే అందరికీ మంచిది. ప్రజలు సహకరించాలి.

– అఖిల్ మహాజన్, ఎస్పీ

చోరీ కేసులో ఆరుగురి అరెస్టు

- పరారీలో మరొకరు
- ఆభరణాలు, రూ.10 వేలు, 6 ఫోన్లు, 2 డమ్మీ తుపాకులు, బైక్ స్వాధీనం



అరెస్టు చూపుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల క్రైం: ఓ ఇంట్లో చొరబడి, దంపతులను డమ్మీ తుపాకులతో బెదిరించి, దొంగతనం చేసిన కేసులో ఆరుగురిని అరెస్టు చేశామని, ఒకరు పరారీలో ఉన్నట్లు జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. శుక్రవారం జగిత్యాలలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన కాసం ఈశ్వరయ్య ఇంట్లో ఈ నెల 14 తెల్లవారుజామున దుండగులు చొరబడ్డారు. దంపతులను బంధించి, డమ్మీ తుపాకులతో బెదిరించి, 10 తులాల బంగారు ఆభరణాలు, రూ.10 వేలు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ పుటేజీ పరిశీలించారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, రూరల్ సీఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నాలుగు పోలీసు బృందాలు నిందితుల కోసం గాలింపు చేపట్టాయి. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి, నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం మున్యాలకు చెందిన మున్నేశుల శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా లక్సెట్‌పేట్ మండలం గోపవాడకు చెందిన పొన్నూరు హైస్కూల్ రికార్డు అసిస్టెంట్ చిప్పబత్తుల తులసయ్య, జగిత్యాల రూరల్ మండలం గుట్రాజ్‌పల్లికి చెందిన బక్కెనపల్లి అరుణ్, బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన యశోద శ్రీనివాస్, జగిత్యాల రూరల్ మండలం అనంతారానికి చెందిన సైదు సహదేవ్, మంచిర్యాల జిల్లా జన్నారం మండలం మగ్రిమడుగుకు చెందిన రత్నం మాణిక్యంలను శుక్రవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 10 తులాల ఆభరణాలు, రూ.10 వేలు, 6 ఫోన్లు, ఒక ద్విచక్రవాహనం, రెండు డమ్మీ తుపాకులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మంచిర్యాల జిల్లా పోచమ్మవాడకు చెందిన ముకునూరి కిరణ్‌కుమార్ పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. డీఎస్పీ రఘుచందర్, రూరల్ సీఐ కృష్ణారెడ్డి, బీర్‌పూర్ ఎస్సై కుమారస్వామి, రూరల్ ఎస్సై సదాకర్, బుగ్గారం ఎస్సై శ్రీధర్‌రెడ్డి, సారంగాపూర్ ఎస్సై దత్తాద్రి, హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్, కానిస్టేబుళ్లు గంగాధర్, శ్రీనివాస్, వెంకటేశ్, ముత్తయ్య, సుమన్, రవి, రమేశ్‌నాయక్, లింగారెడ్డి, శివ, పరమేశ్, జలందర్‌లకు రివార్డులిచ్చి, అభినందించారు.

ఆడుకుంటూ వెళ్లి.. తప్పిపోయిన పాప

- తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

వేములవాడ: ఆడుకుంటూ రోడ్డుపైకి వచ్చి, తప్పిపోయిన ఓ పాపను కుటుంబసభ్యులకు అప్పగించినట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కొడిమ్యాలకు చెందిన రమేశ్–రమ్య దంపతులు వేములవాడలోని తమ బంధువుల ఇంట్లో పెళ్లి ఉంటే ఈ నెల 19న పాపను తీసుకొని, వెళ్లారు. రాత్రి బంధువుల ఇంట్లోనే ఉన్నారు. శుక్రవారం వేకువజామున వివాహానికి హాజరయ్యేందుకు ఫంక్షన్‌హాల్‌కు చేరుకున్నారు. ఆ సమయంలో పాప ఆడుకుంటూ రోడ్డుపైకి వచ్చింది. అలాగే చాలా దూరం వెళ్లింది. కాసేపటికి చిన్నారి కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికారు. ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ప్రభు అనే యువకుడు తప్పిపోయి, ఏడ్చుకుంటూ వెళ్తున్న పాపను ఎత్తుకొని, స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. పోలీసులు ఆ చిన్నారి తల్లిదండ్రులను పిలిపించి, అప్పగించారు. పాపను జాగ్రత్తగా ఠాణాకు తీసుకొచ్చిన ప్రభును సీఐ వీరప్రసాద్ అభినందించారు. రమేశ్–రమ్య దంపతులు అతనితోపాటు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.


పాపను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న సీఐ వీరప్రసాద్

ఎములాడ రాజన్నకు మొక్కులు

వేములవాడ: ఎములాడ రాజన్నను శుక్రవారం దాదాపు 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. స్వామివారికి అభిషేకాలు, అన్నపూజలు చేసి, కోడెమొక్కులు చెల్లించుకున్నారు. సత్యనారాయణ వ్రతాలు, అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. అనంతరం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించి, భీమన్న, నగరేశ్వరాలయాలను సందర్శించారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

స్వామివారి సేవలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు..

వేములవాడ రాజన్నను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు ప్రత్యేక దర్శన అవకాశం కల్పించారు. ప్రొటోకాల్ ఏఈవో అశోక్ శాలువాతో సత్కరించి, ప్రసాదం అందజేశారు.


ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు లక్ష్మీనారాయణకు ప్రసాదం ఇస్తున్న ఏఈవో

ఇంటి పెద్దను ఇంటికి రప్పించండి


భూమేశ్వర్

జగిత్యాలక్రైం: కుటుంబ బాధ్యతలకు భయపడి, ముగ్గురు ఆడ పిల్లల పెళ్లిళ్లు చేయలేననే మానసిక ఒత్తిడితో స్వదేశానికి రాకుండా పదేళ్లుగా సౌదీలో తలదాచుకుంటున్న ఓ గల్ఫ్ కార్మికుడిని స్వదేశానికి రప్పించాలని శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రవాసి ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. వివరాలు.. జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం దమ్మన్నపేటకు చెందిన గూడూరి భూమేశ్వర్ ఏప్రిల్ 2014లో సౌదీ వెళ్లాడు. అప్పటి నుంచి ఫోన్ చేయకపోవడం లేదని, అసలు బతికి ఉన్నాడో లేదో తెలియని పరిస్థితిలో తానూ, తన ముగ్గురు కూతుళ్లు తీవ్ర మానసిక క్షోభ అనుభవించామని భార్య లత ఆవేదన వ్యక్తం చేశారు. సౌదీలో ఉన్న తమ గ్రామస్తులు, తెలిసినవారు ఇటీవల అతన్ని ముహాయిల్ అభా ప్రాంతంలో వెతికి జాడ తెలుసుకున్నారని, ఇండియాకు రావడానికి విముఖత చూపుతున్నాడని వాపోయింది. తన ముగ్గురు కూతుళ్లు మౌనిక, మానస, సహస్ర తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సీఎం రేవంత్‌రెడ్డి, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ తీసుకుని తన భర్తను సౌదీ నుంచి ఇండియాకు రప్పించాలని, తమ పిల్లల చదువుకు సహాయం చేయాలని విజ్ఞప్తి చేసింది. ఆమె వెంట ఎమిగ్రంట్స్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షుడు మంద భీంరెడ్డి, టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ సెల్ అడ్వయిజర్ బొజ్జ అమరేందర్‌రెడ్డి, తిప్పర్తి పుల్లయ్య చారి ఉన్నారు.


ప్రవాసి ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న కుటుంబసభ్యులు

వెన్కెపల్లి యువకుడి అదృశ్యం

- సైబర్ నేరగాళ్లను నమ్మి, రూ.8.50 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు సమాచారం

సైదాపూర్: సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మిన ఓ యువకుడు వారు చెప్పిన ఖాతాకు రూ.8.50 లక్షలు పంపించినట్లు సమాచారం. తర్వాత అతను అదృశ్యమయ్యాడు. పోలీసుల వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలంలోని వెన్కెపల్లికి చెందిన కామారపు శ్రీకాంత్ స్థానిక విశాల సహకార సంఘంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఇతను సైబర్ నేరగాళ్ల మాయలో చిక్కుకున్నాడు. రూ.5 లక్షలు చెల్లిస్తే, మూడు నెలలకే ఆ డబ్బుకు రూ.30 వేలు కలిపి ఇస్తామని, రూ.15 లక్షలు చెల్లిస్తే రూ.40 లక్షలు ఇస్తామని ఆశ చూపారు. నిరుపేద కుటుంబం కావడంతో తమ పేదరికం పోతుందని శ్రీకాంత్ భావించాడు. బంధువులు, స్నేహితులు, తనకు తెలిసినవారి వద్ద రూ.లక్షల్లో అప్పులు చేసినట్లు సమాచారం. ఈ నెల 17న సైదాపూర్ కేడీసీసీ బ్యాంకు నుంచి తన అకౌంట్ నంబర్ 202722010060000 ద్వారా ఎస్‌బీఐ గోరక్‌పూర్ బ్రాంచి, జ్యోతిదేవి అకౌంట్ నంబర్ 38080484767కు రూ.8.50 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు తెలిసింది. గురువారం ఉదయం 11 గంటలకు బైక్‌పై వెళ్లిన శ్రీకాంత్ తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో అతని తల్లి బుచ్చవ్వ శుక్రవారం ఠాణాలో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.


శ్రీకాంత్